# సింగిల్ పేజీ కథలు

## కాలం మారింది!

**రాజారావు రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు. పెద్ద ఉద్యోగం చెయ్యడమేకాక, ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో ఒక పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తుండడం వలన సహజంగానే అహంకారి. కొడుకు పెళ్ళి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుందని, ఎన్నో సంబంధాలు చూసేరు కానీ, ఒకటీ ఆయన స్టేటస్‌కి తగ్గది దొరకడం లేదు. ఎన్నో మ్యారేజి బ్యూరోలకి వెళ్ళి తన శాయశక్తులా ప్రయత్నిస్తూనే వున్నాడు.**

ఆఖరికి ఒకరోజు ఒక మ్యారేజి బ్యూరోలో తన పుత్రరత్నానికి అన్నివిధాలా సరితూగే సంబంధం కనిపించింది. ఇక ఆయన సంతోషానికి అవధుల్లేవు.

వధువు ఇంజనీరింగు ప్యాసై, ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తండ్రి పెద్ద బ్యాంకు ఆఫీసరు. పిల్ల ఫోటో కూడా చాలా ముచ్చటగా వుంది. ఇంకేం, అన్ని వివరాలు తీసుకుని ఇంటికి హుటాహుటిన బయలుదేరి భార్యామణికి శుభవార్త తెలియజేసాడు.

''అయితే ఆలస్యం ఎందుకు వెంటనే జాతకం పంపమని ఫోను చేయండి'' భార్య సలహా.

''అయితే ఒక కప్పు స్ట్రాంగ్ కాఫీ కొట్టించు త్రాగేసి చేస్తా'' ఆయనకి తన కొడుకు పెళ్ళయిపోయినంత సంతోషంగా వుంది. సరే, భార్య కాఫీ అందివ్వగానే త్రాగేసి, ఫోను చేసేడు.



''ఇది చంద్రశేఖర్‌గారిల్లేనాండీ!''

''అవును! ఎవరు కావాలి?'' అవతల ఆడ గొంతు.

''నేను రాజారావు రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు మాట్లాడుతున్నా! మీరెవరు మాట్లాడుతున్నారో తెలుసుకోవచ్చా?''

''నేను వాళ్ళమ్మాయి శిరీషను మాట్లాడుతున్నా!'' అమ్మోయ్ డైరెక్ట్‌గా సాక్షాత్తూ వధువే వచ్చేసిందే. ఒక్క నిమిషం తత్తరపడ్డారు రాజారావు.

''ఏం లేదమ్మా! వారమ్మాయి వివాహానికుందని ఇప్పుడే మ్యారేజి బ్యూరోలో చూసొచ్చేను. ఆ విషయం కనుక్కుందామని..'' నసిగేరు రాజారావుగారు.

''అవునండీ! ఆ అమ్మాయిని నేనే మాట్లాడుతున్నాను. ఏం కావాలి చెప్పండి''

''ఏం లేదమ్మా! మీ నాన్నగారొచ్చేక నీ ఫోటో, జాతకం పంపించమని చెప్పు. మా అబ్బాయికి నచ్చితే, నిన్ను చూడడానికి వస్తాము'' చెప్పేరు రాజారావుగారు.

''మేమే ఎందుకు పంపాలండీ? మీ అబ్బాయి ఫోటో, జాతకం పంపండి. నాకు నచ్చితే మీ అబ్బాయిని చూడడానికి మేమే వస్తాం'' ఈ మాటలకి హతాశుడయ్యేడు రాజారావుగారు. కోపాన్ని దిగమ్రింగుకుని,

''అది మన ఆచారం కాదుకదమ్మా!'' అన్నారు.

''ఏంటండీ ఆచారం? పూర్వకాలం పెళ్ళికొడుకుల కోసం వధువు తండ్రి చెప్పులరిగేలా తిరిగేవారు. మరి ఇప్పుడో మీరే మా అడ్రసు వెదుక్కుని మాకు ఫోను చెయ్యలేదూ?'' అడిగింది శిరీష నవ్వుతూ.

పోనీకదా అని ఫోను చేస్తే ఇంత లోకువ కడుతుందా? ఆడపిల్లకి ఎంత అణుకువ వుండాలి? ఆవేశాన్ని అణుచుకుంటూ ఫోను పెట్టేసి 'కాలం మారింది' అనుకుంటూ సోఫాలో కూలబడ్డాడు రాజారావు.

**-బులుసు రాధాకృష్ణమూర్తి**
(విజయవాడ)

## ఏది ధర్మం

**"అమ్మా! బుక్కెడయ్యా బాంచన్! నీకాల్మొక్త!" బయటి నుండి ఓ పదేళ్ల కుర్రాడి కేక.**

పిల్లలు స్కూల్‌కు వెళ్ళే హడావుడిలో ఉన్నారు. వాళ్లకు టిఫిన్ తయారు చేస్తోంది మా ఆవిడ.

''చిన్నా! ఈ రెండు దోసెలు వాడికి వేసిరా!'' అంత తొందరలోనూ దయార్ద్ర హృదయంతో మా ఆవిడ అంది. మధ్యలో నేను కల్పించుకుని ''ఆఫీసుకు వెళ్ళాల్సిన నన్నూ, స్కూల్‌కి వెళ్ళాల్సిన పిల్లల్నీ వదిలేసి బిచ్చగాడికి వేస్తానంటావే'' కసురుకున్నట్లుగా అనేశాను.

''మీకు దయా, జాలీ ఎలాగూ లేవు. నన్ను కూడా అలాగే ఉండమంటారా? రెండు దోసెలు వాడికి వేసినంత మాత్రాన కొంపలేం అంటుకుపోవు, మీ ఆస్తిపాస్తులేం తరిగిపోవు'' రుసరుసలాడుతూ ఆవిడే వెళ్లి రెండు దోసెలు వాడికి వేసి వచ్చింది.

''అది కాదోయ్! వాడికి వేస్తే మన సొమ్మేం కరిగిపోదు. కానీ పదేళ్ళ వయసునుండే వాడు అడుక్కోవడానికి అలవాటుపడి జీవితాంతం అదే వృత్తికి అంకితమయిపోతాడు. తేరగా వస్తే తినడానికి, పన్చేసి సంపాదించుకు తినడానికి తేడా తెలియదు మరి! ఒక విధంగా మనమే వాడిని సోమరిగా